

పొలం వద్ద పత్రి కొమ్మలతో రైతు

అన్నదాతల నమ్మకం.. ఆచార వ్యవహారాలపై గౌరవానికి ప్రతీక పత్రి కొమ్మల సంబరం. ఏటా దసరా సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పల్లె జనాలు ఈ వారాల పండగలకు ఎంతో ప్రాధాన్యమిస్తారు. వాళ్లు.. వీళ్లు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో భాగస్వాములై ఐక్యతా స్ఫూర్తిని చాటుతారు. అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని భావితరాలకు అందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని పలు గ్రామాల్లో పత్రి కొమ్మల పూజలు వైభవంగా జరుగుతున్నాయి. ఇంతకీ ఈ పండగల ప్రత్యేకతేంటి.. ఎందుకు, ఎలా చేస్తారో తెలుసుకుందాం.. – న్యూస్‌టుడే, నరసన్నపేట, జలుమూరు

ఐక్యతకు ప్రతీక..

- దసరా వేళ గ్రామాల్లో వారాల సందడి
- పూర్వీకుల సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న అన్నదాతలు

పత్రి కొమ్మల వేడుక..!

జిల్లాలోని అనేక గ్రామాల్లో దసరా పండగ ముందు వచ్చే మంగళ, గురు, ఆదివారాల్లో పత్రి కొమ్మల సంబరాలు జరుపుతారు. కొన్ని చోట్ల దసరా దివ్వెలుగా పిలిచే ఈ వారాల ఉత్సవాన్ని దాదాపు అన్ని పల్లెల్లో చేస్తారు. ఏడాది పొడవునా జరిగే అమ్మవారి పండగలకు భిన్నంగా వీటిని నిర్వహిస్తారు. అలా చేయడం వెనుక నిగూఢ అర్థం ఉంది.

ముగ్రాటలు సమర్పించి.. పూజలు చేసి..


పత్రి కొమ్మల సంబరం చేసేముందు గ్రామ పెద్దల అనుమతి తీసుకుంటారు. ఆ తర్వాతే ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ముందుగా అమ్మవారికి ముగ్రాటలు సమర్పించి.. మంగళవాయిద్యాల నడుమ పండగ చేస్తారు. ఇది ఇంత ప్రాచుర్యం పొందడానికి కారణం ఊడుగ కొమ్మలు. వాటిని గ్రామదేవత ఆలయానికి తీసుకువస్తారు. అంతా కలిసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మేక, గొర్రెలను బలి ఇచ్చి.. ఆ రక్తాన్ని కొమ్మలపై జల్లుతారు. అనంతరం కొమ్మలను తీసుకువెళ్లి పొలాల్లో పాతిపెడతారు.

ఊడుగే ఎందుకు..?

ఊడుగ(అంకోలా) మొక్కలు గ్రామ శివార్లలో రహదారి పక్కన పెరుగుతుంటాయి. వాటిని సేకరించి పొలాల్లో ఉంచితే అటు రైతులు, ఇటు పొలాలకు మంచిదని నమ్ముతారు. ఊడుగ మొక్క వల్ల చీడపీడలు ఆశించవు. దీని వేరు చిన్నపిల్లల ఎదుగుదలకు దోహదపడుతుంది. కుక్క కరిచినా, పాముకాటుకు గురైనా ఉపశమనం కలుగుతుందని, ఈ పండ్లు తింటే కండ్ల కలకల బారి నుంచి రక్షణ పొందవచ్చని భక్తుల విశ్వాసం. అందుకే వీటిని ఏటా వారాల సంబరాలు చేసుకుని పొలాల్లో ఉంచుతారు.

సమభావం పెంపొందేలా..

పత్రి కొమ్మల వారాల్లో ఎలాంటి భేషజాలు లేకుండా అందరూ పాల్గొంటారు. చిన్నా పెద్దా.. పేద ధనిక అనే తారతమ్యాలకు తావివ్వకుండా అంతా కలిసి వేడుక జరుపుతారు. అమ్మవారి ప్రసాదం స్వీకరిస్తారు. ఇవన్నీ గ్రామస్థుల్లో సమభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పూర్వీకులు నమ్మేవారు. ఆ ఆనవాయితీనే జనాలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.



పెద్దదూగాంలో అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేస్తున్న రైతులు

ఐదు దశాబ్దాలుగా చేస్తున్నాం..



నా చిన్నప్పటి నుంచి ఏటా పత్రి కొమ్మల వారాల్లో పాల్గొంటున్నాను. ఐదు దశాబ్దాల నుంచి ఊడుగ కొమ్మలను మా పొలంలో ఉంచుతున్నాను. దీని వల్ల పంటకు చీడ పీడలు సోకవని ప్రగాఢ విశ్వాసం. ముళ్లు ఉన్న మొక్కలనే పత్రి వారాల్లో వినియోగిస్తాం.

– పంచరెడ్డి సింహాచలం, ఆదర్శ, ప్రకృతి వ్యవసాయ రైతు, గుండివిల్లిపేట, నరసన్నపేట మండలం

ఆర్‌అండ్‌ఆర్ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: కొవ్వాడ అణు విద్యుత్తు ప్రాజెక్టు నిర్వాసితులకు ధర్మవరం వద్ద చేపట్టిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆర్‌అండ్‌ఆర్ పనులపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ శాఖ పరిధిలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఆ శాఖ నుంచి తీసుకున్న 213 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న కాలనీల్లో రహదారులు, ఉద్యానాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయా పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో కలెక్టర్ భోజనం



అన్న క్యాంటీన్లలో ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని నిర్వాహకులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద అన్న క్యాంటీన్‌లో బుధవారం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సమయ పాలన పాటించాలని, పళ్లేలు, వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలని, సురక్షిత తాగునీరు అందించాలని అక్షయపాత్ర సిబ్బందికి ఆదేశించారు. క్యాంటీన్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి పదవీకాలం పొడిగింపు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్వర్వులు జారీ చేసింది. ఈ నెల 10వ తేదీతో ముగియనుండటంతో వచ్చే ఏడాది ఏప్రిల్ 10 వరకు పొడిగించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా కొనసాగనున్నారు.

జ్ఞాన ప్రదాయిని.. విద్యాస్వరూపిణి..



జిల్లాలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు, దేవీ పీఠాల్లో బుధవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసం, సహస్ర కలాలతో పూజలు జరిపారు. శ్రీకాకుళం నగరం నానుబాలవీధిలో సరస్వతీ దేవి రూపంలో దర్శనమిస్తున్న విజయదుర్గాదేవిని చిత్రంలో చూడవచ్చు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

గంజాయి విక్రేతలపై పోలీసుల కన్ను!

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయి క్రయవిక్రయాలు అరికట్టేందుకు పోలీసుశాఖ నడుం బిగించింది. ఇటీవల ఇచ్ఛాపురం, టెక్కలిలో కిలోల మేర సరకు పట్టుబడటంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. అందులో భాగంగా ఎక్కడెక్కడ నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతుందనేది ఆరా తీస్తున్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌ల్లో నిఘాను పెంచారు. కిళ్లీ బడ్డీలు, అనుమానం వచ్చిన దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఇందుకుగాను ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దాడులకు సిద్ధమయ్యారు.


మరో 60 మంది గుర్తింపు..

జిల్లాలో గంజాయి క్రయవిక్రయాలు జరుపుతున్న 9 మందిని ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా వివిధ ప్రాంతాల్లో 60 మంది వరకు సరఫరాదారులున్నట్లు గుర్తించినట్లు తెలిసింది. వారిని కూడా అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా గంజాయి బ్యాచ్‌ల అడ్డాలపై నిఘా పెంచారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రహదారి, పొన్నాడ వంతెన, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, మొండేటివీధి, లెప్రసీ కాలనీ, తదితర ప్రాంతాల్లో పహారా కాస్తున్నారు. వీటితో పాటు ఒడిశా నుంచి సరకు జిల్లాలోకి వచ్చే సరిహద్దు ప్రాంతాల్లోనూ గస్తీ పెంచారు.

నియంత్రణకు సంకల్పం

ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలతో విశాఖ రేంజి డీఐజీ గోపినాథ్ జెట్టి బుధవారం జూమ్ సమావేశం నిర్వహించారు. గంజాయి రవాణా, సైబర్ నేరాల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని డీఐజీ సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు 'సంకల్పం' అనే కార్యక్రమం ద్వారా ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అక్రమ రవాణాలో తరచూ పట్టుబడినవారిపై పీడీ చట్టం ప్రయోగించాలని స్పష్టం చేశారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం



మా వాళ్లకు వదిలేయండి..!

- మద్యం దుకాణాల ఏర్పాటులో రాజకీయ జోక్యం
- కొందరు నేతల తీరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి

- పాతపట్నం నియోజకవర్గంలో ఓ ముఖ్య నాయకుడు దరఖాస్తుదారులను బహిరంగంగానే బెదిరిస్తున్నారు. ఒడిశాకు చెందినవారినే ఆయన ప్రోత్సహిస్తున్నారని మద్యం దుకాణాల ఆశావహులు ఆరోపిస్తున్నారు.
- పలాసకు చెందిన ఓ కీలక నేత సోమవారం కొందరితో సమావేశం పెట్టారు. తాను ఎంపిక చేసుకున్న దుకాణాలకు సంబంధించి ఎవరూ దరఖాస్తు చేయవద్దని హుకుం జారీ చేశారు.
- నరసన్నపేటలో ఓ నాయకుడి వ్యక్తిగత సహాయకుడు దరఖాస్తుదారులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. తన అనుకూల వర్గాలవారికే మద్యం దుకాణాలను కట్టబెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

వైకాపా హయాంలో ఐదేళ్ల పాటు మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించింది. కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికి నూతన మద్యం విధానాన్ని తెరపైకి తీసుకువచ్చింది. దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి ఆదాయాన్ని రాబట్టుకోవాలనే ఉద్దేశంతో విధి విధానాలనూ ప్రకటించింది. సర్కారు నిర్ణయానికి కొందరు నేతలు తూట్లు పొడుస్తున్నారు. దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపుతున్నవారిని బెదిరిస్తూ ఎక్కడికక్కడ అడ్డుపడుతున్నారు. తొమ్మిది రోజులైనా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడమే అందుకు నిదర్శనం.

జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్‌శాఖ పరిధిలోని 12 సర్కిళ్లలో 158 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటికిగాను బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 2,830 దరఖాస్తులు అందాయి. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాల్లో ఆశావాహులు, వ్యాపారులు కుమ్మక్కై దరఖాస్తులు వేస్తున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షలు డీడీ తీయాల్సి ఉండటంతో కొందరు బృందంగా ఏర్పడి ఎవరికి వచ్చినా అందరికీ న్యాయం జరిగేలా మాట్లాడుకుంటున్నారు. ఇంకొందరు వ్యాపారంపై కనీస అవగాహన లేకపోయినా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. లాటరీ తగిలితే వేరే వాళ్లకి కట్టిన రూ.2 లక్షలకు ఎనిమిది రెట్లకు ఇచ్చేయ వచ్చనే ఆలోచనతో ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి...

సర్కిళ్లు	దుకాణాలు	దరఖాస్తులు
శ్రీకాకుళం	32	727
రణస్థలం	15	425
ఆమదాలవలస	13	244
పొందూరు	10	230
సోంపేట	12	203
ఇచ్ఛాపురం	08	196
కోటబొమ్మాళి	15	158
కొత్తూరు	07	141
పలాస	15	137
పాతపట్నం	08	135
నరసన్నపేట	12	120
టెక్కలి	11	114

రెండు చోట్ల మాత్రమే..

దరఖాస్తు ప్రక్రియలో రాజకీయ నేతల ప్రమేయంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. కొన్ని చోట్ల సమావేశాలు పెట్టి బెదిరింపులకు దిగడం, హెచ్చరికలు జారీ చేయడంతో కొందరు వెనుకంజ వేస్తున్నారు. మరికొందరు ద్వితీయ శ్రేణి నేతల ద్వారా మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటి వరకు శ్రీకాకుళం, రణస్థలం సర్కిళ్లలో మాత్రమే ఆశించిన స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన చోట్ల నామమాత్రంగానే వస్తుండటం గమనార్హం.

ఎప్పుడెప్పుడు.. ఏం చేస్తారు..

- 11న రాత్రి 7 గంటల వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది.
- 12, 13 తేదీల్లో పరిశీలన చేస్తారు.
- 14న ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తారు.
- 15 వరకు ప్రభుత్వమే దుకాణాలను నడుపుతుంది.
- 16 నుంచి కొత్తవి అందుబాటులోకి వస్తాయి.

అవకాశం సద్వినియోగం చేసుకోండి..

మద్యం దుకాణాలకు ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. 11 వరకు ప్రభుత్వం గడువు పెంచింది. ప్రతి ఒక్కరూ ఎలాంటి ఇబ్బంది పడకుండా స్వేచ్ఛగా అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– డి.శ్రీకాంత్ రెడ్డి, ఉప కమిషనర్, అబ్కారీశాఖ, శ్రీకాకుళం

చదువుల తల్లికి జేజేలు..


శ్రీకాకుళం నగరం మొండేటి వీధి శివకామేశ్వరి ఆలయంలో లలితాదేవి


బలగ కాలభైరవాలయంలో అక్షరాభ్యాసం


వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలో కొలువైన దుర్గాదేవి

జిల్లావ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం పలు దేవాలయాల్లో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. పలుచోట్ల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం, పొందూరు, వజ్రపుకొత్తూరు, శ్రీకాకుళం సాంస్కృతికం


ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టిలో మహిళల సామూహిక కుంకుమ పూజ


పొందూరు మండలం తాడివలస ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం వద్ద మొక్కుతున్న విద్యార్థినులు

అంగూరులో పురాతన విగ్రహాల గుర్తింపు



సారవకోట మండలం అంగూరు కుంబేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని చెరువులో రెండేళ్ల కిందట తవ్వకాల్లో బయటపడిన పురాతన విగ్రహాలు క్రీ.శ. 10వ శతాబ్దం నాటివని, తూర్పు గాంగుల కాలానికి చెందినవిగా పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఒకే చోట ఉన్న రెండు విగ్రహాల్లో ఒకటి బ్రహ్మ, రెండోది సరస్వతీదేవి విగ్రహమని ఆయన గుర్తించారు. అప్పట్లో ఈ విగ్రహాల చెవులు, ముక్కుకు వజ్రాలు పొదిగి ఉండేవని, దొంగలు విగ్రహాలకు ఉన్న చెవులు తొలగించి వజ్రాలు తస్కరించినట్లు పురావస్తు పరిశోధకులు తెలియజేసినట్లు అంగూరు గ్రామస్థులు చెప్పారు. ఈ విగ్రహాలను భద్రపరిచి భావితరాలకు అందించాలని శివనాగిరెడ్డి సూచించినట్లు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, సారవకోట

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పరిధి శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో గత మూడు రోజులుగా నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల హ్యాండ్ బాల్ పోటీలు బుధవారం ముగిశాయి. అండర్-17 పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. బాలుర జట్టు రజత పతకం సాధించింది. పోటీల్లో ప్రతిభ కనబరచిన 16 మంది క్రీడాకారులతో జాతీయ స్థాయిలో ఆడే జట్టును ఎంపిక చేశారు. ఇందులో శ్రీకాకుళం జట్టు నుంచి ఇద్దరు ఉన్నారు. విజేతలను కోచ్ మేనేజర్లు ఆర్.సతీష్‌రాయుడు, రెడ్డి ఈశ్వరరావులను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి తదితరులు అభినందించారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్



వనవిష్ణుపురంలో 144 సెక్షన్


గ్రామంలో కవాతు చేస్తున్న పోలీసులు

పోలాకి, నరసన్నపేట, న్యూస్‌టుడే: వనవిష్ణుపురంలో మంగళవారం వైకాపా శ్రేణుల దాడిలో తెదేపా కార్యకర్త వీరాస్వామి మృతి చెందిన విషయం తెలిసిందే. హత్య అనంతరం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. బుధవారానికి పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గ్రామంలోని మహిళలను ఇతర ప్రాంతాలకు తరలించినట్లు ఎస్సై జి.రంజిత్ తెలిపారు. గ్రామంలో కిరాణా దుకాణాలు మూసేశారు. పాడి పశువులకు తాగునీరు, గడ్డి వేసేందుకు స్థానికులు బయటకు రాలేదు. ప్రస్తుతం 200 మంది పోలీసు సిబ్బంది గ్రామంలోని పలు వీధుల్లో కవాతు చేస్తున్నారు.


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం.. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

నేటి నుంచి విజయవాడ-శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : దసరా రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ-శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07215 ప్రత్యేక రైలు ఈ నెల 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో విజయవాడలో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కి శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు నంబరు 07216 ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో ఉదయం 6.30కి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుతుంది. ఈ బండి ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతుంది.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	140	235	255



విద్యార్థులకు అపార్

ONE NATION, ONE STUDENT ID

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, సోంపేట

ఇవీ ప్రయోజనాలు

- విద్యార్థులు వివిధ కారణాలతో పలు విద్యా సంస్థలకు మారుతూ ఉంటారు. అపార్ గుర్తింపు సంఖ్య ద్వారా వివిధ రాష్ట్రాల్లోని విద్యా బోర్డులతో ఏకీకృత వ్యవస్థగా పని చేస్తుంది. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తారు.
- అపార్ గుర్తింపుతో విద్యార్థులు డిజిలాకర్‌కు అనుసంధానమవుతారు. విద్యా విషయక విజయాలు, ధ్రువపత్రాలను డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరుచుకోవచ్చు. ఆయా ధ్రువపత్రాలను ఎక్కడైనా డిజిటల్ రూపంలో వినియోగించుకోవచ్చు.
- పిల్లల అకడమిక్ రికార్డుల పర్యవేక్షణ ద్వారా డ్రాపౌట్లను నివారించే అవకాశం ఉంది. విద్యార్థి ఏకారణంతోనైనా పాఠశాలకు దూరమైతే పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది.
- విద్యార్థుల ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రభుత్వ ప్రయోజనాలు, వివిధ విద్యా సంస్థల్లో చేరికలు, మార్పులు వంటి సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించే విధంగా రూపొందించారు.

జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నూతన మార్పులు తీసుకొస్తోంది. ప్రతి విద్యార్థికి ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ పేరిట కేంద్ర విద్యా శాఖ 12 అంకెలతో కూడిన కార్డు మంజూరు చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను జిల్లాలోనూ చేపట్టడానికి ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

- ఆధార్ తరహాలో 12 అంకెలతో గుర్తింపు కార్డు
- తొలుత 9, 10 తరగతుల పిల్లలకు జారీ
- ఈ నెలాఖరు వరకు నమోదు ప్రక్రియ

డిజిటల్ కార్డులో విద్యార్థి పూర్తి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటాయి.

● ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) అందించేందుకు తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రం తీసుకోవాలని హెచ్‌ఎంలు, యాజమాన్యాలకు సూచించారు. తొలుత 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ నెలాఖరు లోపు అందజేయడానికి రంగం సిద్ధం చేశారు. దసరా సెలవుల అనంతరం బడులు తెరుచుకోగానే ఇందుకు సంబంధించిన కార్యాచరణ వేగవంతం చేయనున్నారు. తొలి విడత పూర్తికాగానే మిగిలిన తరగతులు, పీజీ వరకు జారీ చేయడానికి సన్నాహాలు ప్రారంభమవుతాయి.

ప్రభుత్వ యాజమాన్య పరిధిలో బడుల వివరాలు

పాఠశాల	సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	1,807	45,018
ప్రాథమికోన్నత	314	22,569
ఉన్నత	328	79,497

ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం చేయాలి..

ఆధార్ ఆధారంగా అపార్ గుర్తింపు సంఖ్య జనరేట్ అవుతుంది. ప్రతి విద్యార్థి ఆధార్‌కు తప్పనిసరిగా ఫోన్ నంబరు అనుసంధానమై ఉండాలి. లేని వారు ముందుగా అనుసంధానం చేయించుకోవాలి.

– తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు అన్నారు. అందులో భాగంగా హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పంద కుదుర్చుకున్నట్లు బుధవారం ఆయన తెలిపారు. ఈ ఏడాది 5 కొత్త కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణానంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ చదివి 18 నుంచి 28 ఏళ్లలోపువారు అర్హులని చెప్పారు. మూడు నెలలపాటు ఇచ్చే శిక్షణలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రం అందుకుంటున్న బొల్లినేని మెడిస్కిల్స్ ఈడీ నాగేశ్వరరావు

స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వండి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జడ్పీ సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆమదాలవలస, పాతపట్నం, టెక్కలి, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఆసుపత్రుల అప్‌గ్రెడేషన్ ప్రతిపాదనలను డీఎంహెచ్‌వోను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ, బల్క్ మిల్క్ కేంద్రాల నిర్మాణాల పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజు, డ్వామా పీడీ బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన అవసరం

బలగ(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: కిశోర వికాసం కార్యక్రమంపై అన్ని ప్రాజెక్టుల పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి శాంతిశ్రీ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని కార్యాలయంలో బుధవారం 16 ప్రాజెక్టుల అధికారులు, పర్యవేక్షకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని.. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న వారిని గుర్తించి సమూహంగా ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే కిశోర వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించనుందని చెప్పారు. సాక్ష్యం అంగన్‌వాడీ పథకంలో భాగంగా 153 కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. ప్రధానంగా రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చెడు, మంచి స్పర్శ తదితర అంశాలను 100 రోజుల ప్రణాళికలో వివరించామని గుర్తు చేశారు. సీడీపీవోలు శోభారాణి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

బీఆర్ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌లపై ఫిర్యాదులు: విచారణకు ఆదేశం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్లలోని డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.ఆర్.రజని, రిజిస్ట్రార్ పీలా సుజాతపై పలువురు ఇచ్చిన ఫిర్యాదులపై విచారించి నివేదిక అందజేయాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ ఉప కార్యదర్శి రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఈ నెల 3న ఉత్తర్వులు అందజేశారు. వర్సిటీలో జరిగిన అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగం తదితర అవకతవకలపై ముఖ్యమంత్రి, ఉన్నత విద్యాశాఖ మంత్రి, గవర్నర్‌లకు వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక అందజేయాలని ఉన్నత విద్యాశాఖ ఉప కార్యదర్శి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే, అంబేడ్కర్ విశ్వవిద్యాలయ పరిరక్షణ కమిటీ, హెచ్.శేషగిరి, జి.హరిలతో పాటు పలువురు వర్సిటీ అధికారులపై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది.

గూనభద్ర క్షేత్ర సహాయకుడి సస్పెన్షన్

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని గూనభద్ర ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు పి.ప్రసాదరావును సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ సుగుణాకరరావు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో నీరజ, ఏపీవో ప్రేమలత బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన వేతనదారులు ఉపాధి పనుల్లో సదరు క్షేత్రసహాయకుడు అవకతవకలకు పాల్పడినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. విచారణ చేపట్టిన అధికారుల నివేదిక మేరకు డ్వామా పీడీ చర్యలు తీసుకున్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

పోలాకి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గొల్లలవలసకు చెందిన క్షేత్ర సహాయకుడు కె.లింగన్నపై వచ్చిన అవినీతి ఆరోపణలపై గ్రామంలో ఏపీడీ లోకేశ్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఏడాది జనవరి నెలలో పంచాయతీ నిధులతో చేపట్టిన పనుల్లో రూ.65 వేల వరకు అవకతవకలకు పాల్పడినట్లు స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పథక సంచాలకులు ఆదేశాల మేరకు ఏపీడీ వివరాలు సేకరించారు. నివేదికను త్వరలో అందజేస్తామని చెప్పారు.

రహదారి ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం


సోహిత్ (పాత చిత్రం)

పర్లాఖెముండి, పాతపట్నం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన ఒడిశాలోని గజపతి జిల్లా గుసాని సమితిలో చోటుచేసుకుంది. ఏఎస్సై సుశాంత్‌దొలాయ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం మేజర్ పంచాయతీ యశోదనగర్‌కు చెందిన ఎ.సోహిత్(19), దుర్గమ్మ కాలనీకి చెందిన పి.రాహుల్ సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బీటెక్ చదువుతున్నారు. బుధవారం కళాశాల నుంచి ఇంటికి వస్తున్న సమయంలో పాటికోట గ్రామం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పింది. చోదకుడు సోహిత్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా, రాహుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు జిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం పాతపట్నం తీసుకొచ్చారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆటోలు ఢీ.. ఒకరి మృత్యువాత


గొర్లె చిన్నారావు

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో బుధవారం రాత్రి 7 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో బెలమర గ్రామానికి చెందిన గొర్లె చిన్నారావు (60) మృతి చెందినట్లు ఎస్ఐ జి.రంజిత్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నారావు బెలమర నుంచి పోలాకి ఆటోలో వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న వాహనం, ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు భార్య క్రెమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

విషం తాగి ఆత్మహత్య

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని కొయ్యాం పంచాయతీ కొత్తకుర్మినాయుడుపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎచ్చెర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాగుడు వ్యసనానికి బానిసైన జీరు పరసయ్య(64)ను కుటుంబ సభ్యులు తాగొద్దని పలుసార్లు హెచ్చరించినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఈ నెల 8న ఉదయం మద్యం తాగి ఇంటికి వచ్చిన తీరు పట్ల కుటుంబ సభ్యులు కోపగించుకోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన విషపూరిత ద్రావణం తాగాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆయనను శ్రీకాకుళంలోని సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయన కుమారుడు అసిరినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం పూడిజగన్నాథపురం పంచాయతీ తిమ్మలవానిపేటకు చెందిన దుమ్ము లచ్చయ్య (75) అనారోగ్య సమస్యలతో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బి.నిహార్ చెప్పారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. లచ్చయ్య ఉద్దానంలో జీడి, కొబ్బరి తోట పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలు, ఆర్థిక కష్టాలతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడినట్లు మృతుడి భార్య రాజమ్మ తెలిపారు. వృద్ధుడికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహానికి శవ పంచనామా కోసం బుధవారం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన భార్య ఇచ్చిన పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ


హరిపురం (మందస), న్యూస్‌టుడే: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన మందస మండలం మకరజోలలో బుధవారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన వడ్డి బాబూరావు ఇంటివద్దనే బడ్డీ దుకాణాన్ని నడుపుతున్నారు. ఆయన పని నిమిత్తం బయటకు వెళ్లడంతో అతని తల్లి దమయంతి దుకాణంలో కూర్చొంది. అదే సమయంలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి సీతల పానీయం కొని తాగాడు. డబ్బులు ఇస్తూ వృద్ధురాలి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని ఉడాయించాడు. బాధితురాలు బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకునేలోగా దొంగ పారిపోయాడు. తలకు శిరస్త్రానం ధరించి ఉండటంతో గుర్తు పట్టలేకపోయానని బాధితురాలు లబోదిబోమంటున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్ బాషా తెలిపారు.

పాముకాటుతో వసప వాసి మృతి


కొయిలాపు తేజేశ్వరరావు

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని వసప గ్రామానికి చెందిన కొయిలాపు తేజేశ్వరరావు (34) అనే వ్యక్తి పాముకాటుతో బుధవారం రాత్రి మృతి చెందారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు తేజేశ్వరరావు పశువుల మేతకు పచ్చగడ్డి కోసం గ్రామం సమీపంలోని పొలాలకు వెళ్లారు. గడ్డి కోస్తున్న క్రమంలో పాముకాటు వేసింది. దీనిని గమనించకుండా ఇంటికి చేరే సరికి తీవ్ర అస్వస్థతకు గురై, నోటి నుంచి నురగలు రావడంతో కుటుంబ సభ్యులు కొత్తూరు సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ తెలిపారు.

అధికారిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు


జగదీశ్వరరావు (పాత చిత్రం)

నందిగాం, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి మృతి చెందిన ఎస్ఎస్‌బీ జవాను జగదీశ్వరరావు (37) అంత్యక్రియలు నందిగాంలో బుధవారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. దసరా సెలవులకు కోల్‌కతా నుంచి గత ఆదివారం బయలుదేరారు. హావ్‌డా- ఖరగ్‌పూర్ రైల్వే లైన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలై చనిపోయిన విషయం తెలిసిందే. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఎస్ఎస్‌బీ అధికారులకు అప్పగించగా, వారు ప్రత్యేక విమానంలో విశాఖపట్నం తీసుకొచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నందిగాం చేర్చారు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కన్నీటి వీడ్కోలు మధ్య దహన సంస్కారాలు చేపట్టారు. జగదీశ్వరరావుకి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


అంత్యక్రియల్లో పాల్గొన్న ఎస్ఎస్‌బీ అధికారులు, గ్రామస్థులు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	9440437129
పలాస	8008574279
కవిటి గ్రామీణం	8309630975
పలాస గ్రామీణం	7386409926
కంచిలి గ్రామీణం	9704568739

సమస్య: నర్సీదేవాలయం సమీపంలోమురుగు కాలువ శుభ్రపరచడం లేదు. -జి.నాగేష్, ఇచ్ఛాపురం
సమాధానం: మురుగు తొలగించి, సమస్య పరిష్కరిస్తాం. -పి.ఉపేంద్రకుమార్ పుర ఎస్సై, ఇచ్ఛాపురం
- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సమస్య: పలాస మండలం గంగువాడ ఎస్సీ వీధిలో కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం.- స్థానికులు
సమాధానం: త్వరలోనే నిర్మిస్తాం. -పల్లంరావు పంచాయతీ కార్యదర్శి, కేదారిపురం
- న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

రాష్ట్ర స్థాయి పోటీల్లో కేజీబీవీ విద్యార్థినుల సత్తా


పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.కుసుమ

కవిటి గ్రామీణం: రాష్ట్ర స్థాయి పోటీల్లో కవిటి కొత్తపాలెం కేజీబీవీ విద్యార్థినిలు సత్తాచాటుతున్నారు. బుధవారం వివిధ ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 400 పరుగు పందెంలో ఎస్.కుసుమ మొదటిస్థానం, అండర్-19 కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానంలో మరో విద్యార్థిని బి.కుసుమ నిలిచినట్లు ఎస్ఓ పి.లక్ష్మీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు కె.రాజేశ్వరి తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

స్వచ్ఛ సంకల్పానికి సిద్ధం కండి


కూటమి నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస, మందస, న్యూస్‌టుడే: పలాస నియోజకవర్గంలో విస్తృతంగా చేపడుతున్న స్వచ్ఛ సంకల్పానికి ప్రతి పల్లె, పట్టణాల్లో చేయి చేయి కలపాలని ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. పలాస తెదేపా కార్యాలయంలో బుధవారం తెదేపా, జనసేన, భాజపా నాయకులతో కార్యాచరణపై మాట్లాడారు. దృశ్య మాధ్యమం ద్వారా నియోజకవర్గంలో స్వచ్ఛందసంస్థలు, నాయకులు, ప్రజలతో మాట్లాడి మన పలాస-మన బాధ్యతలో పాలుపంచుకోవాలని కోరారు. సమావేశంలో తెదేపా నాయకులు మల్లా శ్రీనివాసరావు, గాలి కృష్ణారావు, జనసేన నాయకుడు సంతోష్‌పండా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ★ ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 'మన పలాస-మన మాధ్యత' కార్యక్రమాన్ని విజయవంతానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెదేపా మండల అధ్యక్షుడు బి.దుర్యోధనరావు అన్నారు. మందస మండల విస్తృతస్థాయి సమావేశాన్ని జరిగింది. రహదారులు ఇరువైపుల పొదలు, పనికిరాని మొక్కలు తొలగింపు చేపట్టాలని కోరారు. ఉపాధి పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో సిమెంటు రహదారులు, కాలువల నిర్మాణాలు ఈ నెల 14న ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేసి గ్రామాల్లో ప్రగతి చూపాలన్నారు. తెదేపా రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి బి.క్రిష్ణయ్య, జిల్లా అధికార ప్రతినిధి డి.తాతారావు, నవీన్‌యాదవ్, బి.బాస్కరరావు, రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆధార్ ప్రత్యేక శిబిరం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం, కంచిలి ఉప తపాలా కార్యాలయాల్లో గురువారం ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తపాలా శాఖ సోంపేట సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నక్కా శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆధార్‌కు సంబంధించిన అన్ని రకాల సేవలు అందుకోవచ్చునని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

- న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో అభివృద్ధికి నిధులు

అంగన్‌వాడీ కేంద్రాలను వైకాపా సర్కారు పట్టించుకోకపోవడంతో ఐదేళ్లపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతూ వెళ్లేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి పెట్టింది. చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది. కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో పక్కా భవనాలున్న చోట మరుగుదొడ్లు, తాగునీటి కల్పన కోసం నిధులు మంజూరు చేసింది.

రూ.పదిన్నర లక్షలు మంజూరు..

కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో మొత్తం 186 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు. గత ప్రభుత్వంలో కనీస వసతులపై దృష్టి పెట్టిన దాఖలాలు లేక పోవడంతో కూటమి ప్రభుత్వం వీటి మెరుగుకు పూనుకుంది. తొలి విడతగా పక్కా భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు చర్యలు చేపట్టింది. 36 చోట్ల పనుల కోసం దాదాపు రూ.పదిన్నర లక్షలు మంజూరు చేసింది. ఇందులో 22 కేంద్రాలకు మరుగుదొడ్లు, 14 కేంద్రాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు మొదలయ్యాయి.

కాశీబుగ్గ ప్రాజెక్టు పరిధిలోని	కేంద్రాలు:	చిన్నారులు:	గర్భిణులు:	బాలింతలు:
	186	1741	814	766


కేదారిపురంలో నీటి సదుపాయం లేని మరుగుదొడ్డి

మరుగుదొడ్డి ఉన్నా... నీళ్లు రావు

పలాస మండలం కేదారిపురం అంగన్‌వాడీ కేంద్రంలో రెండు మరుగుదొడ్లు ఉన్నా అందులో ఒక గది వినియోగానికి నోచుకోలేదు. మరో దాన్ని వినియోగిస్తున్న నీటి సౌకర్యం లేదు. బకెట్లతో బయట నుంచి నీరు తీసుకెళ్లాల్సి వస్తోందని సిబ్బంది చెబుతున్నారు. ఈ కేంద్రంలో ఆరుగురు చిన్నారులు, ఇద్దరు గర్భిణులు, ఆరుగురు బాలింతలు ఉన్నారు. మరుగుదొడ్లలో నీరు లేక వీరంతా ఇబ్బంది పడుతున్నారు. ఈ కేంద్రానికి తాగునీటి ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. మండలంలోని చినంచల అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగింత..

మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పన పనుల ఏర్పాటు బాధ్యతలను గ్రామీణ నీటి సరఫరా శాఖకు అప్పగించారు. ఒక్కో మరుగుదొడ్డికి రూ.36 వేల చొప్పున 22 పనులకు రూ.7.92 లక్షలు, తాగునీటి కల్పనకు ఒక్కో కేంద్రానికి రూ.17 వేల చొప్పున 14 పనులకు రూ. 2.38 లక్షల మేర కేటాయించారు. వీటినంత వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు ఆ శాఖ డీఈఈ పైడి సూర్యనారాయణ తెలిపారు.

త్వరలోనే ప్రారంభం

పక్కా భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. మంజూరైన కేంద్రాల్లో త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
- పార్వతి, సీడీపీవో, కాశీబుగ్గ

నిర్లక్ష్యం పెరుగుతోందిలా!



ఇచ్ఛాపురం పట్టణంలోని కార్జీవీధి ఇళ్లసముదాయం మధ్యలో ఉన్న రాతికట్టు బావి నీటిని నేటికీ వాడుతున్నారు. అయితే దాని నిర్వహణపై పుర పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. బావి మధ్యలోంచి రాతి మొక్కలు పెరిగి వాటి నుంచి ఎండిన ఆకులు నీటిలో పడుతుండటంతో నీరు కలుషితమవుతోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బావిని పరిశీలించి, అవసరమైన నిర్వహణ పనులు జరిపిస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు. -న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అధ్వాన దారి

సోంపేట - కంచిలి ప్రధాన రహదారి (పాత జాతీయ రహదారి) నుంచి కొత్త జాతీయ రహదారి పైవంతెన వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు నోచుకోక భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాహన రాకపోకలకు అవస్థలు తప్పలేదు. వాహనాలు పాడవుతున్నాయని పలువురు వాపోతున్నారు. విషయమై ఆర్అండ్‌బీ ఏఈ డి.విక్రమ్ వివరణ కోరగా గతంలో ఈ రోడ్డు పనులను వేరొక గుత్తేదారుకి ఇచ్చాం. కొన్ని ప్రాంతాల్లో పనులు చేసినప్పటికీ వాటికి బిల్లులు విడుదల కాక పోవడంతో ఆగాయి. రెండు నెలల్లో పనులు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కంచిలి



తొట్టెలు నిరుపయోగం



కవిటి మండలంలోని పలు గ్రామాల్లో తోటల్లో ఆకులు, ఇతర చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీకి ఉపాధి హామీ పథకంలో తొట్టెలు నిర్మించారు. ప్రస్తుతం ఆ తొట్టెలు నిరుపయోగంగా మారాయి. వీటి నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేయడంతో వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ సమస్యను ఏవో బి.దుర్గాప్రసాద్‌ను తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

రహదారి బురదమయం..

పలాస మండలం చినంచల అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రోడ్డు దారుణంగా ఉంది. చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోందని, నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌ను వివరణ కోరగా త్వరలోనే సీసీ రోడ్డు వేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం



అంధకారంలో ముత్యాలపేట కూడలి



ఇచ్ఛాపురం పట్టణం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న చిన్నముత్యాలపేట కూడలిలో ఉన్న వీధి దీపం గత నెల రోజులుగా వెలగడం లేదు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేల బయటకు వెళ్లేందుకు భయం పడుతున్నామని అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని పుర ఏఈ కామేశ్వరరావు తెలిపారు. -న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సరస్వతీ నమస్తుభ్యం


స్వేచ్ఛావతి అమ్మవారిని అభిషేకిస్తున్న ఎమ్మెల్యే అశోక్


పీఎంపురంలో పూజలందుకుంటున్న సరస్వతీదేవి


పలాస రైల్వేకాలనీ జ్ఞాన సరస్వతి ఆలయంలో..


బైపల్లిలో దుర్గాదేవికి పట్టు వస్త్రాలు, సారె సమర్పిస్తున్న గ్రామస్థులు

దేవీనవరాత్రి ఉత్సవాల్లో బుధవారం మూలా నక్షత్రం పురస్కరించుకుని దుర్గమ్మ సరస్వతీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా ప్రత్యేకంగా పూజలు చేశారు. వివిధ ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. - న్యూస్‌టుడే బృందం

రహదారులపై నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు


రహదారి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

పలాస, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా పురపాలక సంఘం పరిధిలోని రహదారులపై నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎన్.రామారావు హెచ్చరించారు. సూర్యతేజ డిగ్రీకళాశాల రహదారి, తిలక్‌నగర్‌లో ఇళ్ల నిర్మాణాలపై ఫిర్యాదులు రావటంతో బుధవారం ఆయన పట్టణ ప్రణాళిక సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. పురపాలక సంఘం సర్వేయర్ చంద్రశేఖర్, సచివాలయ ఎమినిటి సెక్రటరీ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం

హరిపురం (మందస), న్యూస్‌టుడే : మందస మండలం హరిపురం ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. పలాస డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి యువత ఈ శిక్షణ పోటీల్లో పాల్గొన్నారు. యోగా, సూర్య నమస్కారాలు, దండప్రయోగం, యుద్ధం వంటి శారీరక అంశాలపై శిక్షణ ఇచ్చారు. దేశ చరిత్ర, జాతీయ నాయకుల గాథలు, దేశభక్తి గీతాలు నేర్పించారు. పలువురు వక్తలు పాల్గొని ఆర్ఎస్ఎస్ సేవలను కొనియాడారు.

అంబులెన్స్ వితరణ



సోంపేట కంటి ఆరోగ్యవరానికి జీవిత బీమా సంస్థ అంబులెన్స్‌ను అందించింది. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఎస్‌డీఎం శారద ప్రసాద్‌దాస్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే జీవిత బీమా సంస్థ లక్ష్యమని, ఆరోగ్యవరంలో అంబులెన్స్ సదుపాయం లేక వృద్ధులు ఇబ్బందులు గుర్తించి అందించామని తెలిపారు. ఎల్ఐసీ సీఎం టి.బిసోవి, ఎస్ఎం రవికిరణ్, సోంపేట, ఇచ్ఛాపురం బీఎంలు ఎం.వెంకటేష్, శ్రీరామ్‌మూర్తి, సిబ్బంది సాంబమూర్తి, కార్తిక్, చంద్రశేఖర్, సాయి మణికంఠ తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, సోంపేట

బస్సు మొరాయింపుతో నిలిచిన ట్రాఫిక్

పలాస, న్యూస్‌టుడే: పలాస రైలు నిలయం సమీపంలో ఆర్టీసి బస్సు మొరాయించటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పలాస నుంచి పాతపట్నం వెళుతున్న ఆర్టీసి బస్సు లెవల్‌క్రాసింగ్ దాటిన తర్వాత అకస్మాత్తుగా రహదారి మధ్యలో నిలిచి రాకపోకలు ఆటంకం కలిగించింది. ఇదే సమయంలో రైళ్లు ఒకదాని వెంట మరోకటి రాకపోకలు సాగించటంతో గంటపాటు వాహనాలు నిలిచి పోయాయి. బస్సుకు మరమ్మతులు చేసి పక్కకు తరలించటంతో ట్రాఫిక్ కదిలింది.

అవీ..ఇవీ..అన్నీ

బాధ్యతల స్వీకరణ

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండల తహసీల్దార్‌గా డి.సీతారామయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించి అనంతరం మండల రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలు, పౌర సేవలు సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తొలుత తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు, డీలర్లు, సచివాలయం సర్వేయర్ల స్వాగతం పలికారు. ఉప తహసీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని నగరంపల్లిలో బుధవారం విశాఖపట్నం రుత్విక్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు దువ్వాడ శాలిని, పైడి కార్తిక్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రొమ్ము క్యాన్సర్, కీళ్లు, ఎముకలు సంబంధింత వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత శిబిరాన్ని గ్రామ పెద్దలు ప్రారంభించారు. విశ్రాంత జేసీ దువ్వాడ మార్కేండేయులు, స్థానిక మాజీ సర్పంచులు వైద్య బృందం పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సర్వశిక్ష అభియాన్ పరిధిలో పనిచేస్తున్న ఒప్పంద వ్యాయామ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు కవిటి మండలంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకల పాటి రఘువర్మను కవిటిలో కలిసి వినతి పత్రం అందించారు. త్వరలో భర్తీచేయనున్న డీఎస్సీలో ప్రస్తుతం పనిచేస్తున్న వారిని మినహాయించి పోస్టులను ప్రకటించాలని కోరారు.

రాజ్యాంగ రక్షణకు ఉద్యమించాలి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: బహుజన సంక్షేమం, రాజ్యాంగ రక్షణకు ఉద్యమించాలని పలువురు పేర్కొన్నారు. బహుజన నాయకుడు కాన్సిరాం వర్ధంతి సందర్భంగా కాశీబుగ్గలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. కాన్సిరాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విశ్రాంత బ్యాంకు అధికారి సత్యనారాయణ, టి.పాపారావు, తారకేశ్వరరావు, పద్మలోచన, దుర్యోధన, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చక్రం చోరీ

హరిపురం (మందస), న్యూస్‌టుడే: మందసలో కొత్తరకం దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామానికి చెందిన వ్యాపారి మధు ద్విచక్ర వాహనం ముందు చక్రాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగలు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్ బాషా తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మానసిక ఉల్లాసానికి, శారీరక ఉత్సాహానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానంరామక్రిష్ణాపురంలో జరుగుతున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీల కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో మాట్లాడారు. స్థానిక సర్పంచి చింత హేమారావు, చింత నారాయణ, బాలరాజు పాల్గొన్నారు.

బోరు ప్రారంభం

కవిటి, న్యూస్‌టుడే : మండలం పరిధి గొండ్యాలపుట్టుగలో మండల పరిషత్తు 15వ ఆర్థిక సంఘం నిధులతో వేసిన మోటర్ బోరును బుధవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రారంభించారు. కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కడియాల పద్మ, నాయకులు పాల్గొన్నారు.

దసరా సెలవులతో రైళ్లు, బస్సులు కిటకిట


కాశీబుగ్గ బస్టాండ్ వద్ద రద్దీ ఇలా..

పలాస, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల సందర్భంగా సొంత గ్రామాలకు చేరుకునే ప్రయాణికులతో రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలు కిటకిటలాడుతున్నాయి. పలాస మీదుగా నడిచే రైళ్లు కిక్కిరిసి ఉంటున్నాయి. పలాస రైలు నిలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులతో నిండుగా కనిపించింది. కాశీబుగ్గ బస్టాండ్ వద్ద సైతం ఆర్టీసీ బస్సుల్లో తమ సొంత గ్రామాలకు చేరుకునేందుకు వచ్చిన వారితో బస్టాండ్ వద్ద రద్దీ నెలకుంది.

మద్యం దుకాణాలకు 201 దరఖాస్తులు

సోంపేట, న్యూస్‌టుడే : సోంపేట ఎక్సైజ్ పరిధిలో బుధవారం వరకు 201 దరఖాస్తులు అందినట్లు సీఐ కె.బేబీ తెలిపారు. సోంపేట పరిధిలోని సోంపేట, మందస, కంచిలి మండలాల్లో 12 మద్యం దుకాణాల అనుమతులకు దరఖాస్తులు అందాయన్నారు. 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 14వ తేదీన డ్రా తీసి దుకాణాలను కేటాయిస్తామని చెప్పారు.

వంకరపోయిన కాలికి చికిత్స

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఈదుపురానికి చెందిన జుత్తు లింగయ్య తన రెండు కాళ్లూ వంకరపోవడంతో రెండువారాల కిందట ఇచ్ఛాపురంలోని చిన్నమేదరవీధిలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి వచ్చారు. అర్థోపెడిక్ సర్జన్ డా.వెచ్చా సంతోష్ వృద్ధుడికి శస్త్రచికిత్స చేసి ఒక కాలును సరిచేశారు. 15 రోజుల తర్వాత ఆ వృద్ధుడు నడుచుకుంటూ ఆసుపత్రికి వచ్చినట్లు వైద్యుడు తెలిపారు.


చికిత్స ముందు, తర్వాత ఇలా..

ఆర్థిక సాయం అందజేత


ఇచ్ఛాపురం: సోమేష్‌కు నగదును అందిస్తున్న గ్రామపెద్దలు, యువత

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పేదరికానికి తోడు క్యాన్సర్ మహమ్మారి ఆ కుటుంబానికి శాపంగా మారగా, వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు గ్రామం కదిలింది. మండలం అరకబద్ర గ్రామానికి చెందిన సోమేష్ గతంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతూ.. ఆరోగ్యవంతుడయ్యాడు. మళ్లీ అదే సమస్య రావడంతో ఇప్పటికే ఆర్థికంగా చితికి పోయి, కుటుంబ పోషణనే ఇబ్బంది పడుతున్న వారి పరిస్థితి గమనించిన గ్రామస్థులు సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆయనతో పాటు పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు, యువత, పెద్దలు రూ.62,500 బుధవారం బాధిత కుటుంబానికి అందించారు.

పూర్వ విద్యార్థుల చేయూత


వజ్రపుకొత్తూరు గ్రామీణం: చిన్నారికి నగదు ఇస్తున్న పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలికి చెందిన 4వ తరగతి విద్యార్థి జె.కుసాల ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కింద పడి ఎడమచేయి విరిగింది. కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో ఆమె తల్లి సుజాతోపాటు స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు వారికి సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు బుధవారం బాధిత కుటుంబాన్ని కలిసి రూ.18,300ను అందించారు. గ్రామస్థులు పూర్వ విద్యార్థులను అభినందించారు. పూర్వ విద్యార్థులు జి.శ్రీనివాసరెడ్డి, కే.వీ.రమణ, ఎం.మల్లేశ్వరరావు, ఎం.రాజు పాల్గొన్నారు. ★ కవిటి మండలం గొర్లపాడుకు చెందిన బి.శ్రీకాంత్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు బుధవారం రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుల సాయం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : కవిటి మండలం బొరివంక గ్రామానికి చెందిన మజ్జి సుజాత గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె పేదరాలు కావడంతో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, గ్రామస్థులు, యువకులు కలిసి బుధవారం ఆమెకు రూ.42 వేలు ఆర్థిక సాయం అందించారు. సర్పంచి శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్, బెందాళం విజయ్‌కృష్ణ, పాండవ శేఖర్, లక్ష్మణమూర్తి, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

దోమపోటుపై అప్రమత్తంగా ఉండాలి


నగరంపల్లి పంట పొలంలో శాస్త్రవేత్తలు, రైతులు

వజ్రపుకొత్తూరు, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: వరికి దోమపోటు, పొడు తెగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన్ కేంద్రం కీటక నాశన శాస్త్రవేత్త అనూష పేర్కొన్నారు. మండలంలోని నగరంపల్లిలో బుధవారం ఏడీఏ ఎల్‌వీ మధు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో కిరణవాణి, ఏఈవో జ్యోత్స్న కూటమి నాయకులు రైతులు పాల్గొన్నారు.★ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ప్రభుత్వం అన్ని విధాలా రైతులకు సహకరిస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్ అన్నారు. పలాస మండలం పెదంచలలోని రైతు సేవా కేంద్రంలో వీహెచ్ఏ ఝాన్సీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

టెక్కలి
•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం హర్షబాడ పంచాయతీ సవరరామకృష్ణాపురంలో వీధి దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలి.

- బూరె మాధవరావు, గ్రామస్థుడు

★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం

- చంద్రశేఖరరావు, ఇంఛార్జి పంచాయతీ కార్యదర్శి, హర్షబాడ – న్యూస్‌టుడే, నందిగాం

స్నేహమేరా జీవితం..

సారవకోట ఉన్నత పాఠశాలలో 1984-85 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం సందడిగా జరిగింది. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని స్నేహితులంతా ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. నాడు చదువులు నేర్పిన గురువులు బోయిన మోహనరావు, శిమ్మ జగన్నాథం, బఠాన శ్రీరాములు, ఎన్.వి.రమణమూర్తి, పొన్నాన బైరాగి, తర్ర సోమిబాబు, బి.శ్రీరాములునాయుడు, జి.అప్పారావులను సత్కరించారు. – న్యూస్‌టుడే, సారవకోట



విద్య వినయేన శోభతే



టెక్కలిలో పూజలు చేస్తున్న భక్తులు



జలుమూరు ప్రాథమిక పాఠశాలలో..

టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు సరస్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల సామూహిక పూజలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే బృందం



ఎల్ఎన్‌పేట: కరకవలసలో...



నరసన్నపేటలో సామూహిక పూజలు



నందిగాం మండలం పెద్దతామరాపల్లిలో..

ప్లాంటు ఉన్నా తప్పని పాట్లు..!

న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

★ సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గతంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. గత ఐదు నెలలుగా అది పనిచేయడం లేదు. ఏదైనా సాంకేతిక లోపంతో మరమ్మతులకు గురైతే సంబంధిత నిపుణుడు వచ్చి బాగు చేస్తారని గతంలో గుత్తేదారుడు తెలిపారు. ప్రస్తుతం దీని గురించి పట్టించుకునే వారే కరవయ్యారు.

★ నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంటును బాగుచేయాలని నిపుణుడిని కోరిన పట్టించుకోవడం లేదు. ఒప్పందం అయిపోయిందని. తమకు సంబంధం లేదని సమాధానం చెబుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నారు. ఇది కేవలం ఈ రెండు పాఠశాలల పరిస్థితి మాత్రమే కాదు. సంతబొమ్మాళి మండలంలోని పలుచోట్ల ఇలాంటి దుస్థితితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

తాగునీటికి విద్యార్థుల అవస్థలు



నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌కు తాళం

నిరుపయోగంగా మారాయి

విద్యార్థులకు శుద్ధజలం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు మండలంలో పలు పాఠశాలల్లో మూలకు చేరాయి. వాటిని బాగుచేసి వినియోగంలోకి తీసుకు రావాలని సంస్థ నిర్వాహకులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పు లేదు. గత ప్రభుత్వం హయాంలో చిల్లిగవ్వ మంజూరు చేసిన పాపాన పోలేదు. దీంతో చాలా చోట్ల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బందే సొంత నిధులు వెచ్చించి నీటిని అందిస్తూ విద్యార్థుల గొంతు తడుపుతున్నారు.

80 శాతానికి పైగా మూలకు..

సంతబొమ్మాళి మండలంలో సుమారు 30 పాఠశాలల్లో తొలి విడతగా శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అందులో ప్రస్తుతం పనిచేస్తున్నవి వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. 80 శాతానికి పైగా పనిచేయడం లేదు. యంత్రాల్లో నాసిరకం వస్తువులు వాడారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏర్పాటు చేశామా... డబ్బులు జేబులో వేసుకున్నామా... అన్నట్లు గుత్తేదారులు వ్యవహరించారు. వాటి నిర్వహణ సైతం గాలి కొదిలేశారు. దీంతో చాలా చోట్ల విద్యార్థులు ఇంటి నుంచి నీటిని సీసాలతో తెచ్చుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మూలకు చేరిన పరికరాలకు మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని పలుమార్లు నిర్వహించిన సమావేశాల్లో ప్రధానోపాధ్యాయులు ఈ సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. గతంలో గుత్తేదారుడు ప్లాంట్లు ఏర్పాటు చేసిన సందర్భాల్లో సాంకేతిక నిపుణుడు చరవాణి నంబరు అందించారు. పనిచేయడం లేదని ఫోన్ చేసిన పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– జె.చిన్నవాడు, ఎంఈవో, సంతబొమ్మాళి

సూర్యఘర్ యోజనతో విద్యుత్తు ఆదా

టెక్కలి పట్టణం, నరసన్నపేట, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంతో విద్యుత్తు ఆదా అవుతుందని ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఈఈ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. టెక్కలి మేజరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సౌర పలకలు ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలు, ఏర్పాటుకు అయ్యే ఖర్చు, ప్రభుత్వ రాయితీలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఈ తమ్మినేని ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు పాల్గొన్నారు. ★ సౌరవిద్యుత్తు వినియోగంపై గురువారం నరసన్నపేట విద్యుత్తు ఉప కేంద్రం వద్ద అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్తు శాఖ టెక్కలి ఈఈ శంకరరావు తెలిపారు.



టెక్కలిలో మాట్లాడుతున్న విద్యుత్తుశాఖ అధికారులు

ఉన్నా.. ఏం ఉపయోగం..

కొత్తూరు మండలం గూనభద్ర ఆర్అండ్ఆర్ కాలనీలోని విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనం వినియోగానికి దూరంగా ఉంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేరే దారి లేక సిబ్బంది సామాజిక భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. కొద్దిమేర పనులు మిగిలి ఉన్నాయని, పూర్తి చేసి ఇబ్బందులు తీరుస్తామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు



సంపద కల్ల.. స్వచ్ఛత కల



కోటబొమ్మాళి మండలం కిష్టుపురం చెత్తసంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారింది. చెత్త సేకరణ మాట అటుంచితే కొన్నాళ్లుగా ఈ కేంద్రం వైపు ఎవరూ వచ్చినట్లు లేదు. పరిసరాల్లో పనికి రాని మొక్కలు పెరిగిపోయాయి. దీంతో ప్రజాధనం వృథాగా మారిందని, అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు. నిర్మించటం వరకు తమ బాధ్యతని నిర్వహణ పంచాయతీలు చూడాలని ఏపీవో గుజ్జల హరిప్రసాద్ స్పష్టంచేశారు. చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

నిర్వహణ లేదు నిర్లక్ష్యమే..!

నందిగాం మండలం దిమిలాడలో సుమారు 75 ఎకరాల విస్తీర్ణంలో నల్ల చెరువు ఉంది. దీని ద్వారా దాదాపు 500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాసారం నిండా పనికిరాని మొక్కలు పెరిగిపోవడంతో ఏటా నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. పొలాలకు సాగునీరు అంతంత మాత్రమే అందుతోందని రైతులు వాపోతున్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరైతే పనులు చేపడతామని వంశధార శాఖ ఏఈ భాస్కరరావు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం



మొండి గోడలకు మోక్షం లేదా



పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో గిరిజన ఉత్పత్తులు నిల్వ చేసి, విక్రయించేందుకు హాట్ బజార్ నిర్మాణం చేపట్టారు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభమైనా నేటికీ పూర్తి కాలేదు. శ్లాబ్ దశకు వచ్చిన తరువాత నిలిచిపోయాయి. అధికారులు చర్యలు తీసుకుని త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఐటీడీఏ డీఈఈ రవికుమార్ వద్ద ప్రస్తావించగా.. గుత్తేదారుకు తెలియజేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, పాతపట్నం

కొత్తూరులో ఆర్డీవో పర్యటన

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని మాతల గ్రామంలో వంశధార నదిపై ప్రతిపాదిత ఇసుక ర్యాంపును టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి బుధవారం పరిశీలించారు. నది నుంచి 16.20 ఎకరాల్లో ఇసుక లభ్యమయ్యే ప్రదేశాన్ని గుర్తించి, హద్దులను నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బియ్యపు మిల్లును తనిఖీ చేసి, ధాన్యం కొనుగోలుకు తగు సూచనలు చేశారు. పారాపురం రెవెన్యూ గ్రామంలో ఈ పంట నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దారు రవిచంద్ర, వ్యవసాయాధికారిణి స్వర్ణలత పాల్గొన్నారు.



మాతల ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, ఇతర అధికారులు

అవీ..ఇవీ..అన్నీ

అన్ని కేంద్రాలు వినియోగంలోకి రావాలి

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో మోహన్‌కుమార్ సూచించారు. అవలంగి గ్రామంలోని కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, హిమబిందు పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరులోని శ్మశానవాటికలో బోరు మరమ్మతులకు గురవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను సర్పంచి కృష్ణవేణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మణికంఠ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా వారు స్పందించారు. సిబ్బందితో బుధవారం చేతిపంపునకు మరమ్మతులు చేయించారు.

స్పందనకు వందనం

అన్నదానానికి రూ.50 వేల విరాళం

టెక్కలి పట్టణం: స్థానిక జిల్లా ఆసుపత్రి ఆవరణలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానానికి టెక్కలికి చెందిన ఏలూరి సత్యనారాయణ, లక్ష్మీనరసింహరావు రూ.50వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. మాతృమూర్తి ఏలూరి సత్యభాస్కరాంబ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందించినట్లు వారు తెలిపారు. సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆటో చోదకుడిపై దాడి

కోటబొమ్మాళి: కురుడు పంచాయతీ పాకివలసకు చెందిన ఆటో చోదకుడు కర్రి వీరన్నపై గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం దాడి చేసినట్లు స్నేహితులు తెలిపారు. టెక్కలి నుంచి కోటబొమ్మాళి వస్తుండగా తర్లిబొడ్డసాడు సమీపంలో ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు వివరించారు. బాధితుడిని కోటబొమ్మాళి సామాజికాసుపత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నారు.

ఐతమ్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 5న ప్రారంభమైన ఎన్‌సీసీ శిక్షణ 14వ తేదీ వరకు కొనసాగుతుందని కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. 14వ ఆంధ్రా బెటాలియన్ శ్రీకాకుళం కమాండింగ్ అధికారి కల్నల్ కేదార్‌నాథ్‌సాహు, ఏవో కల్నల్ ప్రసూన్‌కుమార్ పండా ఆధ్వర్యంలో శిక్షణ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ మేజర్ వి.మహేష్, కెప్టెన్ వై.పోలినాయుడు, ఐతమ్ ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ టి.మురళీమోహన్ పాల్గొన్నారు.



కొత్తూరులో కాన్షీరాం వర్ధంతి

కొత్తూరు, న్యూస్‌టుడే: నేతాజీనగర్ కాలనీలో కాన్షీరాం వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీఎస్పీ పాతపట్నం నియోజకవర్గ బాధ్యుడు బొడ్డేపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సందడిగా బాణాల పండగ

సారవకోట, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: సారవకోట మండలంలోని అవలంగిలో జేబీటీ పాఠశాల విద్యార్థులు బుధవారం బాణాల పండగను సందడిగా నిర్వహించారు. వెదురు కర్రలతో తయారు చేసిన బాణాలను విద్యార్థులు చేతపట్టుకొని బుడితి, అవలంగి, చీడిపూడి గ్రామాల్లో దసరా పాటలు పడుతూ సందడి చేశారు. తల్లిదండ్రులు అందించిన పప్పు బెల్లాలు, మిఠాయిలు ఆరగిస్తూ ముందుకు సాగారు. పాఠశాల వ్యవస్థాపకుడు జె.మోహన్‌గాంధీ తెలిపారు. ★ కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు పురాతన సంస్కృతికి అద్దం పట్టేలా గ్రామంలో చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు షణ్ముఖ, గోపి పాల్గొన్నారు.



కోటబొమ్మాళి మండలం కొత్తపల్లిలో...



సారవకోట: అవలంగిలో బాణాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

నేడు ఆధార్ శిబిరం

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం తపాలా కార్యాలయంలో గురువారం ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమదాలవలస సబ్ డివిజన్ తపాలా అధికారి విక్రమ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని బసవరాజుపేట గ్రామానికి చెందిన సిద్ధాంతం అప్పన్న రోడ్డు ప్రమాదంలో బుధవారం గాయపడ్డారు. సరుబుజ్జిలి ఎస్సై టి.రాజేష్ అందించిన వివరాలు ప్రకారం.అప్పన్న పాలకేంద్రానికి వెళ్తున్న సమయంలో ఏబీ రహదారిపై బసవరాజు పేట కూడలి వద్ద వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలు కావటంతో శ్రీకాకుళం తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. కుమారుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

నరసన్నపేట, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో వరి పంటకు తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి సునీత సూచించారు. నరసన్నపేట మండలం దూకులపాడులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక దిగుబడులకు సాధించేందుకు కాలిబాటలు తీయాలని రైతలకు అవగాహన కల్పించారు. కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడిలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి: పెద్దబమ్మిడిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

రీసర్వే తప్పుల్ని సరిచేయండి

టెక్కలి పట్టణం, నందిగాం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వేలో దొర్లిన తప్పులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. టెక్కలి మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ అట్ల సరోజనమ్మ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు సంతకాలు చేసి వెళ్లిపోవడంతో శాఖలవారీ సమీక్ష నామమాత్రంగానే జరిగింది. ఈ సందర్భంగా రీసర్వే సమస్యలను పలువురు తహసీల్దారు దిలీప్‌చక్రవర్తి దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీల్లో పలు భవనాలు నిర్మించి రెండేళ్లు కావస్తున్నా బిల్లులు అందలేదని మరికొందరు వాపోయారు. అనంతరం ఉపాధిహామీ నిధులతో చేపట్టనున్న పనులకు ఆమోదం తెలిపారు. ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు పేడాడ రమేష్, మన్నేల కిశోర్ పాల్గొన్నారు. ★ నందిగాం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులను పలు అంశాలపై సభ్యులు నిలదీశారు. ఎంపీడీవో రాజారావు, ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు, యర్ర చక్రవర్తి పాల్గొన్నారు.



నందిగాం: మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామ్మూర్తి

అధికారుల బాధ్యతల స్వీకరణ



నరసన్నపేటలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఇంజినీరింగ్ సహాయకులు

నరసన్నపేట, సంతబొమ్మాళి, హిరమండలం, కొత్తూరు, న్యూస్‌టుడే: జలజీవన్ మిషన్‌తో పాటు పలు తాగునీటి పథకాల పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకేశ్వరరావు సూచించారు. బదిలీపై వచ్చిన ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ సహాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ● సంతబొమ్మాళి తహసీల్దారుగా రాకోటి రమేష్‌కుమార్, ఎంపీడీవోగా పి.జయంత్‌ప్రసాద్ విధుల్లో చేరారు. ● హిరమండలం మేజరు పంచాయతీ ఈవో తంప హరికృష్ణ, జూనియర్ సహాయకుడు వర కార్తీక్, బిల్ కలెక్టర్ ఎన్. రమణమ్మ బాధ్యతలు స్వీకరించారు. ● కొత్తూరు మండల వెలుగు ఏపీఎంగా విధుల్లో చేరిన లలితకు సిబ్బంది శుభాకాంక్షలు చెప్పారు.

వైకాపా వైఫల్యంతోనే వినతుల వెల్లువ

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ప్రజా దర్బారులో వినతుల వెల్లువకు గత వైకాపా ప్రభుత్వ వైఫల్యమే కారణమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. తాగునీరు, రహదారులు, విద్యుత్తు, పింఛన్లు, రేషన్ కార్డులు, గృహనిర్మాణ పథకాలు తదితర వాటికి సంబంధించి ఆయన అర్జీలు తీసుకున్నారు. 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, సలాన మోహనరావు, స్థానిక సర్పంచి రేఖాన లక్ష్మమ్మ, శ్రీనివాసరావు, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు

తెరపై ఈనాడు

★ కీర్తన: రామ్‌నగర్ బన్నీ ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: దేవర ★ ఎస్‌వీసీ (రామలక్ష్మణ): దక్షిణ ★ సూర్యమహల్: శ్వాగ్ ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: మత్తు వదలరా-2 ★ మారుతి: చిట్టి పొట్టి

– న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

దేవతామూర్తుల ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం ఇందిరానగర్ వద్ద గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న దేవతామూర్తుల ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు జగన్మోహనరావు, ఎం.ఉషారాణి దంపతుల పర్యవేక్షణలో అర్చకుడు బంకుపల్లి చరణ్‌శంకర్ ఆధ్వర్యంలో మహాలక్ష్మి, సరస్వతి సమేత పరివార దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. తొలిరోజు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, యాగశాల, అఖండ దీపస్థాపన, ధ్వజారోహణ, గ్రామ ప్రదక్షిణ పూజలు నిర్వహించారు. ఈ నెల 11 వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నాగావళి పరివాహక ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచండి



మంగువారితోట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరాన్ని ఆనుకుని ఉన్న నాగావళి నది పరీవాహక ప్రాంతాల్లో పొదల్ని తొలగించాలని నగరపాలక సంస్థ అధికారులను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశించారు. నగరంలోని మంగువారితోట ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించారు. నదికి ఆనుకుని ఉన్న పొదలను కొందరు ఆకతాయిలు ఆవాసంగా చేసుకుని గంజాయి, మద్యం తాగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ పొదలు, పనికి రాని మొక్కల్ని తొలగించాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య పనుల తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారి డా.పి.సుధీర్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట తెదేపా నాయకుడు ఆర్.శంకర్ తదితరులు ఉన్నారు.

పరుగు భళా..



శ్రీకాకుళం నగరానికి చెందిన అన్నెపు ఈశ్వరరావు ఆరు పదుల వయసులో పరుగు పెట్టి ద్వితీయ స్థానం సాధించారు. ఇటీవల విశాఖపట్నంలో మౌంటెన్ వ్యూ, డీసీసీబీ సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో 10 కి.మీ. విభాగంలో పాల్గొని రజత పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు, జిల్లా దివ్య జీవన సంఘం ప్రతినిధులు అభినందించారు.

–న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావుతో ముఖాముఖి

నగర సుందరీకరణకు ప్రాధాన్యం



శ్రీకాకుళం నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు తెలిపారు. అందులో భాగంగా ఉద్యానాలను సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు రహదారుల మధ్యన మొక్కలు నాటడం, ప్రభుత్వ కార్యాలయాల గోడలపై కళాత్మకత ఉట్టిపడేలా రంగులు వేయనున్నట్లు చెప్పారు. ప్రధాన కూడళ్లతో పాటు రహదారుల విస్తరణకు చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. వీటితో పాటు నగరవాసులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోనున్న చర్యలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన వివరించారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి..

నగర పరిధిలోని పౌరులకు వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందేలా చూస్తున్నాం. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పలు కీలక విభాగాల్లో కొందరు సిబ్బంది ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పని చేయడంతో పాలనా పరంగా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించాం. వాటిల్లో మార్పులు, చేర్పులు చేసి ఆయా విభాగాల ప్రక్షాళన చేస్తాం. అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు పునః ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతున్నాం. వీధి దీపాలు నిర్వహణ, కుక్కల బెడద, బహిరంగ ప్రదేశాల్లో పశువుల సంచారం, తదితర సమస్యలపైనా ప్రత్యేక దృష్టి సారిస్తాం.

విలీన పంచాయతీల్లో తాగునీరందిస్తాం

విలీన పంచాయతీల్లో ఇంటింటికీ వ్యక్తిగత కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరందిస్తాం. అమృత్ పథకంలో భాగంగా రూ.13.02 కోట్లతో పనులు చేసేందుకు సమగ్ర ప్రణాళిక(డీపీఆర్) తయారవుతోంది. అది ఆమోదం పొందిన వెంటనే అందుకనుగుణంగా పనులు చేపడతాం. ఈ పనుల్లో భాగంగా పెద్దపాడు, ఖాజీపేటలో రిజర్వాయర్ల నిర్మాణంతో పాటు అవసరమైన చోట పైపులైన్లు ఏర్పాటు చేసి దశలవారీగా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తాం. ప్రస్తుతం పెద్దపాడుతో పాటు నగరానికి ఆనుకుని ఉన్న విలీన ప్రాంతాలకు కొంత మేర కుళాయిల ద్వారా నీరందిస్తున్నాం. ఇతర ప్రాంతాల్లో రక్షిత పథకాలు, బోర్లు, ట్యాంకర్ల ద్వారా స్థానికుల అవసరాలు తీరుస్తున్నాం.

80 అడుగుల మేర పాలకొండ రోడ్డు విస్తరణ

రోడ్డు విస్తరణ: రోజురోజుకు పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా డే అండ్ నైట్ కూడలి నుంచి ఆదివారంపేట వరకు పాలకొండ రహదారిని 80 అడుగుల మేర విస్తరించనున్నాం. గతంలో 60 అడుగుల మేర మాత్రమే విస్తరించాలని నిర్ణయించినప్పటికీ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయంలో మార్పు జరిగింది. ఆ మేరకు ప్రణాళిక విభాగం అధికారుల అనుమతి కోసం నగరపాలక సంస్థ తరఫున నివేదిక అందించాం. ఆ పనులకు అవసరమైన స్థల సేకరణ కొంత మేర జరిగింది, ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే ప్రైవేటు స్థలాల యజమానులకు టీడీఆర్‌లు అందించి అనంతరం పనులు పూర్తి చేస్తాం.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

శ్రీకాకుళం నగరంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. నిత్యం సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనులు చేపట్టేలా చూస్తున్నాం. విలీన ప్రాంతాల్లో సీసీ కాలువల్లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రానున్న రోజుల్లో నిధుల లభ్యత ఆధారంగా నిర్మిస్తాం. నగరంలో ఇటీవల రూ.2 కోట్లతో కాలువల్లో పూడిక తీయించాం. సమస్య శాశ్వత పరిష్కారానికి సమగ్ర మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు డీపీఆర్ రూపకల్పన జరుగుతోంది. దానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే నూతన కాలువలు నిర్మిస్తాం. తద్వారా నగరంలో ముంపు, మురుగు సమస్య పరిష్కారానికి ఆస్కారముంటుంది.



విజేతలతో చీఫ్ ఆర్బిటర్ భీమారావు

ఉత్సాహంగా చదరంగం పోటీలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం నానుబాలవీధి చదరంగం శిక్షణ కేంద్రంలో బుధవారం అండర్-15 ఓపెన్ చదరంగం పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 25 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో జి.అశ్రిత్‌రామ్, బెండి జీవన్, ఎస్.యశ్వంత్, కోరాడ జశ్వంత్ వరుస స్థానాల్లో నిలిచారు. బాలికల విభాంలో రిత్విక ఎంపికైంది. వీరు గుంటూరులో ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు హాజరవుతారని ఫిడే ఆర్బిటర్ సనపల భీమారావు తెలిపారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: రణస్థలం మండలంలోని పైడిభీమవరం చెక్‌పోస్టులో బుధవారం ఓ ఇసుక లారీని రెవెన్యూ అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు వారు గుర్తించి పోలీసులకు అప్పగించారు. జేఆర్‌పురం ఎస్సై ఎస్.చిరంజీవి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



బూర్జ స్టేషన్‌లో దస్త్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం రాత్రి వేళ ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాల నిర్వహణను, ప్రత్యేక గదులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే మహిళలు, వృద్ధుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం తగదని సిబ్బందికి సూచించారు. ఎస్సై ఎం.ప్రవళ్లిక, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దండి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: పిల్లలను ఉత్తములుగా తీర్చిద్దిదేందుకు, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తగిన ప్రణాళికతో వారిని తీర్చిదిద్దాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. బుధవారం ఆమదాలవలసలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

రాకపోకలకు ఇక్కట్లు



పొందూరు మండలం దల్లవలస నుంచి పెనుబర్తికి వెళ్లే రహదారికి ఇరువైపులా పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగి ముందుకు చొచ్చుకురావడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ ఆంజనేయ నాయక్‌తో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా రహదారి పక్కన ఉన్న పనికి రాని మొక్కలు తొలగించేలా చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, పొందూరు

దుమ్ము రేగుతోంది..!

అలికాం-బత్తిలి రహదారిలో సరుబుజ్జిలి కూడలి నుంచి పోలీసు స్టేషన్ వరకు పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు అధికం కావడంతో ఆ గోతుల్లో ఇటీవల ఎర్ర కంకర వేశారు. దీంతో బుగ్గి రేగిపోతుండటంతో దుమ్ము, ధూళితో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి పాడైన చోట కనీసం నీళ్లతో తడిపిస్తే కొంతవరకు బాగుంటుందని అంటున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయ నాయక్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



అధ్వాన దారితో అవస్థలు



శ్రీకాకుళం నగరం పీఎన్ కాలనీ మూడో లైన్‌లో సీసీ రహదారులు, కాలవలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడితే బురదమయమై రాకపోకలకు సమస్య తలెత్తుతోంది. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఆ ప్రాంతంలో సీసీ రహదారి, కాలవల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

అవీ..ఇవీ..అన్నీ



ఆదిత్యుని సేవలో సిక్కిం విశ్రాంత డీజీపీ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లిలో సూర్యనారాయణస్వామిని బుధవారం సిక్కిం విశ్రాంత డీజీపీ ఎ.సుధాకరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ సిబ్బంది, అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అనివెట్టి మండపంలో వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు. స్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ

పొందూరు, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖాధికారి-1గా జి.రాజేంద్రప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంఈవో-1గా పనిచేసిన పి.వి.రామరాజు గత నెలలో పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు రాజేంద్రప్రసాద్‌ను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఎంఈవో-2 పి.రాజారావు, ఎమ్మార్సీ సిబ్బంది అభినందించారు.

నేడు ప్రజాదర్బార్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండల పరిధిలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి స్వయంగా వినతులు స్వీకరిస్తానని.. ఈ అవకాశాన్ని శ్రీకాకుళం గ్రామీణ మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోస్టాఫీసులో ఆధార్ నమోదు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు పట్టణ పోస్టాఫీసులో ఈ నెల 10, 11 తేదీల్లో కొత్తగా ఆధార్ నమోదు, అప్‌డేట్ తదితర సేవలు అందించనున్నట్లు పొందూరు సబ్ పోస్టుమాస్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ రెండు రోజులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలు అందుబాటులో ఉంటాయని, మండల వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గర్భిణులకు సీమంతాలు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అక్కులపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో బుధవారం అక్కులపేట-వేణమ్మపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళా సభ్యులు గర్భిణులకు ఘనంగా సీమంతాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్నట్లు అక్కులపేట వైద్యాధికారిణి వసంత తెలిపారు. గర్భిణులతో పాటు సహాయకులకు భోజనం అందించారు. సత్యసాయి సేవా సమితి జోనల్ కోఆర్డినేటర్ జనార్థనరావుతో పాటు సభ్యులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



'మునగవలస'కు ఘన సన్మానం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: సత్యసాయి సేవా సమితి జోనల్ సమన్వయకర్త మునగవలస జనార్థనరావును బుధవారం మండలంలోని అక్కులపేట-వేణమ్మపేట సత్యసాయి సేవా సమితిలో ఘనంగా సన్మానించారు. ఆయన సేవా కార్యక్రమాలకు గుర్తించి సన్మానించినట్లు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎం.సత్యనారాయణ అన్నారు. సేవా సమితి కన్వీనర్ సూర్యారావు, మాజీ కన్వీనర్ వెంకటరావుతో పాటు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



గాజులకొల్లివలసలో రైతులకు వరి సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో మోహహనరావు

ఆమదాలవలస గ్రామీణం, గార, న్యూస్‌టుడే: వరి సాగులో తగిన సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి మెట్ట మోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని గాజులకొల్లివలసలో పంట పొలాల్లో వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు. ❖ పంటల సాగులో మెలకువలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారిణి డి.పద్మావతి తెలిపారు. గార మండలం కొర్ని గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణాధికారిణి శ్రీదీప్తి, కె.స్వాతి, స్థానిక రైతులు పాల్గొన్నారు.



రామలక్ష్మణ కూడలి వద్ద..



ఉమారుద్రకోటేశ్వరాలయంలో రాజరాజేశ్వరీదేవి



బూర్జ: లాభాంలో..



పాత శ్రీకాకుళం: నక్క వీధిలో..

సరస్వతీ నమస్తుభ్యం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని పలు దేవాలయాలు, మందిరాలు, పీఠాల్లో భక్తులు పుస్తకాలు, కలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. పలు ఆలయాలకు చిన్నారులు పెద్దఎత్తున తరలిరావడంతో సందడి నెలకొంది. – న్యూస్‌టుడే బృందం



పొందూరు: కింతలిలో..



పొందూరు: లోలుగులో..



రెడ్డిక వీధి విజయదుర్గాదేవి ఆలయం వద్ద సామూహిక అక్షరాభ్యాసం



సరుబుజ్జిలి: సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లను వీటి అభివృద్ధిలో భాగస్వాములను చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయులపై బోధనేతర పనిభారం తగ్గించి వారు అధిక సమయం విద్యార్థులకు పాఠ్యాంశాలు నేర్పించేలా చూసేందుకు ప్రభుత్వం కొత్త విధానం అమల్లోకి తీసుకువచ్చింది. దీంతో పాఠశాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తుంది.

–న్యూస్‌టుడే, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం



పొందూరు ప్రభుత్వ పాఠశాల

పరిశుభ్రతలో కమిటీలకు భాగస్వామ్యం..!

❖ ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయింపు ❖ పాఠశాలల్లో మెరుగుపడనున్న పారిశుద్ధ్యం

సభ్యులకు ఐడీ పాస్‌వర్డ్లు: గత వైకాపా ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలను రద్దు చేసి తల్లిదండ్రుల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో వారిని కేవలం ఉత్సవ విగ్రహాలను చేసింది. నెలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు రావడం, సంతకాలు చేసి వెళ్లడానికే వారు పరిమితమయ్యారు. తాజాగా కూటమి ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలను పునరుద్ధరించి సభ్యులకు కీలక బాధ్యతలు అప్పగించింది. సభ్యులు ప్రతి బుధ, శుక్రవారాల్లో పాఠశాలలకు వచ్చి మరుగుదొడ్ల చిత్రాలు తీయాలని ఆదేశాలు వచ్చాయి. వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య(ఐడీ) పాస్‌వర్డ్లు కేటాయించారు. ఆ సంఖ్యతో ఐఎంఎంఎస్ యాప్‌ను తెరిచి మరుగుదొడ్ల చిత్రాలను అప్‌లోడ్ చేయాలి. దీనిపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. కమిటీలో 15 నుంచి 21 మంది వరకు సభ్యులు ఉండగా బడుల పరిశుభ్రత బాధ్యతలు వీరికే అప్పగించింది. కమిటీ సభ్యులు, సచివాలయ సంక్షేమ సహాయకులు మరుగుదొడ్ల చిత్రాలు తీయాలని నిర్ణయించింది. వీటిని ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా తర్ఫీదు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

★ **నియోజకవర్గం:** ఆమదాలవలస (ఆమదాలవలస, పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి మండలాలు)

★ **ప్రభుత్వ బడులు:** 284 (ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు)

★ **నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు:** 15,802 మంది

అవగాహన కల్పిస్తున్నాం: పాఠశాల పరిశుభ్రతలో అందరిని భాగస్వాములు చేయడం వల్ల పాఠశాల పరిసరాల పరిశుభ్రతకు కమిటీ దోహదపడుతుంది. కమిటీ సభ్యులకు ఫొటోలు తీయడం, అప్‌లోడ్ చేయడంపై అవగాహన కల్పిస్తున్నాం. పరిశుభ్రతలో ఏమైనా సమస్యలు ఉంటే పాఠశాల ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే చర్యలు తీసుకుంటాం.

–విజయలక్ష్మి, ఉప విద్యాశాఖాధికారిణి, శ్రీకాకుళం

సౌర విద్యుత్తు వినియోగించుకోండి



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనలో భాగంగా రాయితీ అందిస్తున్న సౌర విద్యుత్తు వినియోగంతో గృహ వినియోగదారులంతా విద్యుత్ ఛార్జీలు తగ్గించుకోవాలని విద్యుత్తు శాఖ డీఈ రమణమూర్తి అన్నారు. మండలంలోని రణస్థలంలో విద్యుత్తు ఉప కేంద్రం ఆవరణలో పీఎం సూర్య ఘర్ యోజనపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు శాఖ అధికారులతో సోలార్ పథకంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



స్నేహాంజలి నృత్య భంగిమ

పొందూరు, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12 వరకు ఏర్పాటు చేసిన భరత నాట్యం ప్రదర్శనలో భాగంగా మంగళవారం రాత్రి ఇక్కడ మండలంలోని లత్సయ్యపేటకు చెందిన సనపల స్నేహాంజలి ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా నుంచి స్నేహాంజలి పాల్గొని నృత్య ప్రదర్శన చేశారు. మారుమూల గ్రామానికి చెందిన ఈమె ఇంద్రకీలాద్రిపై ఇచ్చిన ప్రదర్శన పట్ల గ్రామస్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

పొన్నాడ మాజీ సర్పంచి మృతి



ముసలయ్య (పాతచిత్రం)

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని పొన్నాడ పంచాయతీ మాజీ సర్పంచి పంచిరెడ్డి ముసలయ్య(87) అనారోగ్యంతో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈయన 30 ఏళ్ల పాటు గ్రామానికి సర్పంచిగా బాధ్యతలు నిర్వహించారు. ఈయనకు భార్య అమ్మనమ్మ, కుమారుడు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ముసలయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పరామర్శించగా ఆయన వెంట పంచిరెడ్డి సత్యనారాయణ, కృష్ణారావులు ఉన్నారు.